క్లుప్తంగా

లలితా త్రిపురసుందరిగా దుర్గాదేవి



పూజలందుకుంటున్న దుర్గాదేవి

విజయనగరం టౌన్: శరన్నవరాత్రి మహోత్స వాల్లో భాగంగా స్థానిక రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడిలో కొలువైన దుర్గాదేవి ఆదివారం లలితా త్రిపుర సుందరీదేవీగా భక్తులకు దర్శన మిచ్చారు. ఆలయ వేదపండితులు వెలువలప ల్లి నరసింహామూర్తి శర్మ, సాయిలు అమ్మవా రికి శాస్త్రోక్తంగా పూజాధికాలు చేశారు. ఈ సం దర్భంగా నిర్వహించిన శ్రీచక్ర కుంకుమార్చన లలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

రోగులకు వైద్య సేవలు



రోగులకు మందులు అందజేస్తున్న పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కనక సింహాచలం, సర్పంచ్ గౌరి, తదితరులు

డెంకాడ: మండలంలోని డెంకాడ గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం లో పలువురు రోగులకు వైద్య పరీక్షలు నిర్వ హించారు. విజయనగరానికి చెందిన సాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సిబ్బంది నిర్వహిం చిన వైద్య శిబిరాన్ని డెంకాడ పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు రొంగలి కనక సింహాచలం, సర్పం చ్ పతివాడ గౌరి ప్రారంభించారు. వివిధ విభా గాలకు చెందిన డాక్టర్లు సింధూరి, సతీష్ రెడ్డి, కిశోర్, తదితరులు రోగులను పరీక్షించి, అవస రమైన వారికి మందులు అందజేశారు. కార్యక్ర మంలో గ్రామపెద్దలు పాల్గొన్నారు.

అమ్మ అనుగ్రహం పొందాలి



ఆధ్యాత్మిక విషయాలను వివరిస్తున్న డాక్టర్ పెన్మేటి స్వప్న హైందవి

విజయనగరం టౌన్: శరన్నవ రాత్రుల్లో అమ్మను కొలిచి ప్రతి ఒక్కరూ అనుగ్రహాన్ని పొందాలని రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పెన్మేటి స్వప్నహైందవి అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక రామనా రాయణం ప్రాంగణంలో శ్రీమాతా వైభవంపై మహాలక్ష్మీ స్వరూపాన్ని భక్తులకు వివరిం చారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చిన్నారులకు పాలు, బిస్కెట్లు



చిన్నారులకు పాలు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న ఆలయ సూపర్‌వైజర్ ఏడుకొండలు, సూర్యపాత్రో, తదితరులు

విజయనగరం టౌన్: పైడితల్లి అమ్మవారి దర్శ నానికి తల్లిదండ్రులతో పాటు వచ్చే చిన్నారు లకు పైడిమాంబ దీక్షాపీఠం ఆధ్వర్యంలో ఆదివారం పాలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ సూపర్‌వైజర్ ఏడు కొండలు మాట్లాడుతూ, దాతలు ముందుకు వచ్చి ఉత్సవాల్లో మరిన్ని సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో దీక్షాపీఠం వ్యవస్థాప కుడు ఆర్.సూర్యపాత్రో, తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కుచట్టంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సమాచార హక్కుచట్టం జిల్లా సమన్వయ కమిటీ సభ్యుడు సూర్యారావు

శృంగవరపుకోట: సమాచార హక్కు చట్టంపై యువత విస్తృతంగా ప్రచారం చేయాలని ఆ చట్టం జిల్లా సమన్వయ కమిటీ సభ్యులు డి.సూర్యారావు కోరారు. సమాచార హక్కు చట్టం తీసుకొచ్చి ఈనెల 12వ తేదీ నాటికి 19 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా సూర్యారావు సమాచార హక్కు చట్టం ముఖ్య ఉద్దేశం, లక్ష్యాలు, సాధించిన విజయాలను పాఠకులు, యువకులకు వివరించారు. లైబ్రే రియన్ డి.శ్రీధర్ పాల్గొన్నారు.

ధ్రువపత్రాల జారీలో మార్పులు

- జనన, మరణ ధృవీకరణకు నూతన విధానం



విజయనగరం కార్పొరేషన్ కార్యాలయం

విజయనగరం:

జనన, మరణ ధ్రువపత్రాల జారీలో మార్పులు చోటుచేసుకున్నాయి. ఏ ప్రాంతంలో పుట్టినా, మరణించినా వారికి అధికారికంగా మం జూరు చేయాల్సిన ధ్రువపత్రాలపై ప్రభుత్వం నూతన మార్గదర్శకాలు జారీ చేసింది. గతంలో ఉన్న విధి, విధానాలను స్వల్పంగా మార్పు చేస్తూ తాజాగా ఉత్తర్వులు విడుదల చేసింది. నూతన విధానంలో పాత పద్ధతిలో మాదిరిగానే దరఖాస్తు చేసుకోవాల్సి ఉండగా... తప్పుగా పేరు నమోదైన వారి వివరాలను మార్పుకోసం నూతన విధానం అనుసరించాల్సి ఉంటుంది.

24 గంటల్లో ..

ప్రైవేట్ ఆస్పత్రుల్లో పుట్టిన బిడ్డ వివరాలు 24 గం టల్లో డాక్టర్ లాగిన్ ద్వారా సివిల్ రిజిస్ట్రేషన్ సిస్ట మ్‌లో నమోదు చేసి ఆన్‌లైన్‌తో పాటు, మాన్యువ ల్‌గా రిజిస్ట్రార్ లాగిన్‌కు పంపించాలి. సదరు రిజి స్ట్రార్ వాటిని పరిశీలించిన తర్వాత ఏవైనా తప్పులు దొర్లితే చెప్పడానికి 24 గంటలు సమయం ఇస్తారు. జన్మించిన బిడ్డ లేదా మృతుని వివరాలు 21 రోజుల్లో పేర్కొని జనన, మరణ ధువపత్రాలు తీసు కోవచ్చు.

మూడు వారాలు గడిస్తే..

మూడు వారాలు గడిచిన తర్వాత నుంచి 30 రోజుల్లోపు దరఖాస్తు చేసుకున్న వారు అపరాధ రుసుం చెల్లించి పత్రాలు పొందొచ్చు. అనంతరం ఆ ధ్రువపత్రాలు తీసుకోవాలంటే ఆలస్య రుసుము రూ.5 చెల్లించాక కార్పొరేషన్ ద్వారా జిల్లా జనన, మరణాల రిజిస్ట్రార్‌కు ఆన్‌లైన్‌తో పాటు మాన్యు వల్ విధానంలో దరఖాస్తు పంపించి పొందొచ్చు. ఇలా ఒక ఏడాది లోపు వరకు జనన, మరణాల ధ్రువపత్రాలు పొందొచ్చు.

ఏడాది దాటితే ఇలా..

సంవత్సరం దాటాక ఆర్డీఓ లేదా సబ్ కలెక్టర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్ ప్రకారం ధువపత్రాలు తీసుకో వాలి. కార్పొరేషన్ జనన, మరణాల రిజిస్ట్రార్ సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్‌లో నమోదు చేసిన జనన, మరణాల వివరాలు పరిశీలించి సదరు ధ్రువ పత్రాలు మంజూరు చేస్తారు. ఇలా మంజూరు చేసి నట్లుగా దరఖాస్తుదారుని సెల్‌ఫోన్‌కు లాగిన్ వివ రాలు పేర్కొన్న సందేశం చేరుతుంది. ఈ లాగిన్ ద్వారా మీసేవా లేదా ఇతర సంస్థల నుంచి జనన, మరణ సర్టిఫికెట్ తీసుకోవచ్చు. లేదంటే పురపాలక సంఘం నుంచి కూడా పొందొచ్చు.

ఇంగ్లిష్ లేదా తెలుగులో..

ఇప్పటికే ఉన్న 1969 చట్టం బర్త్ అండ్ డెత్‌లో తీసు కొచ్చిన సవరణలను 2024 అక్టోబర్ చట్టంగా పిలుచుకుంటున్నారు. గతంలో ఆ ధ్రువపత్రాలు కేవలం ఇంగ్లీష్ భాషలో లభ్యమయ్యేవి. ఇప్పుడు తెచ్చిన సవరణలతో ఇంగ్లిష్ లేదా తెలుగు లేదా రెండు భాషల్లో కలిపి ఉండేలా తీసుకోవచ్చు.

జిల్లా జనన, మరణాల రిజిస్ట్రార్ లాగిన్‌లో పేర్లు మార్పు

ఉదాహరణకు శ్రీను పేరులో ఎస్‌ఆర్‌ఐఎన్‌యుకు బదులు ఎస్‌ఆర్‌ఈఈఎన్‌యుగా మార్చాల్సి వస్తే విజయనగరం కార్పొరేషన్‌లో జనన, మరణాల రిజిస్ట్రార్ సరిచేస్తారు. అదే రవివర్మ పేరులో రవి మాత్రమే పడి, వర్మ పడక పోతే ఆ పదాన్ని చేర్చేం దుకు జిల్లా జనన, మరణ రిజిస్ట్రార్ లాగిన్‌కు పం పించాలి. వీటిని కూడా గతంలో కార్పొరేషన్ జనన, మరణాల రిజిస్ట్రార్ సవరించి ధ్రువపత్రం మంజూరు చేసే వారు. ఈ పనిని వీరి నుంచి జిల్లా జనన, మరణాల రిజిస్ట్రార్‌కు బదిలీ చేశారు.

గతంలో ఇలా..

1969 బర్త్ అండ్ డెత్ చట్టం ప్రకారం.. ఆస్పత్రిలో పుట్టిన బిడ్డ లేదా మరణించిన వారి వివరాలు సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్‌లో ఆన్‌లైన్‌లో 21 రోజుల్లోపు నమో దు చేసి పొందొచ్చు. ఆ గడువు దాటిన తర్వాత నుంచి ఏడాదిలోపు వచ్చిన వారు అపరాధ రుసుం చెల్లించి స ర్టిఫికెట్లు తీసుకునే వారు. అప్పుడు జిల్లా జనన, మర ణాల రిజిస్ట్రార్ వద్దకు వెళ్లే విధానం ఉండేది కాదు. అలాగే రిజిస్ట్రార్‌కు పంపించిన వివరాలు దరఖాస్తుదా రునికి పంపించి సరిచూసుకుని చెప్పమనే విధానం గతంలో లేదు. అలాగే లాగిన్‌లో వివరాలు నమోదైన వాటిని బయట ప్రింట్ తీసుకునే సౌకర్యం లేదు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా..!



మొయిద కాజ్ వే సమీపంలో రైల్వే పట్టాల వద్ద డంప్ చేసిన ఇసుక

- చెలరేగిపోతున్న అక్రమార్కులు
- చోద్యం చూస్తున్న అధికారులు

నెల్లిమర్ల: ఇసుక అక్రమ రవాణ జోరుగా సాగుతోం ది. ముఖ్యంగా చంపావతి నదీ పరివాహక ప్రాం తంలో జరజాపుపేట, మొయిద కాజ్‌వే, రామతీర్థం కాజ్‌వే, జూట్‌మిల్ వంతెన సమీపంలో ఇసుక తవ్వ కాలు జరిపి ట్రాక్టర్లు, నాటుబళ్లు, ద్విచక్ర వాహనాల ద్వారా ఇసుకను వేరే ప్రాంతాలకు తర లించి అక్కడ నిల్వ చేస్తున్నారు. జూట్‌మిల్ బ్రిడ్జి సమీపంలో నీటి పథకాల ట్యాంక్‌ల సమీపంలో ఇసుక తవ్వకాలు చేపడుతున్నా అధికారులు పట్టిం చుకోవడం లేదు. తవ్వకాలు ఇలానే కొనసాగితే విజయనగరానికి నీటి ఎద్దడి తప్పదని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక డంప్ చేసిన ప్రాంతం నుంచి రాత్రి వేళల్లో లారీలు, ట్రాక్టర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తూ అక్ర మార్కులు లక్షలాది రూపాయలు దోచుకుంటు న్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఇసుక దోపిడీ ఎక్కువైందన్న ఆరోపణలు బలంగా వినిపి స్తున్నాయి. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తప్పవు

నెలిమర్ల: పేకాట, కోడిపందాలు, ఓపెన్ డ్రింకింగ్, గంజాయి విక్రయాలు చేపడితే చర్యలు తప్పవని ఎస్సై గణేష్ హెచ్చరిం చారు. నెల్లిమర్ల రైల్వే బ్రిడ్జి సమీపంలో పేకాటాడుతున్న ఏడుగురు నిందితులను ఆదివారం అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ. 1270 స్వాధీనం చేసుకు న్నారు. అలాగే బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతున్న పది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

పూసపాటిరేగ: మండల కేంద్రం మీదుగా అనుమతుల్లేకుండా ఇసుక తరలిస్తున్న రెం డు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్సై ఐ.దుర్గా ప్రసాద్ తెలిపారు. చంపావతి నది నుంచి ఇసుక తరలిస్తుండగా.. ట్రాక్టర్లను ఆది వారం సీజ్ చేశామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

సీతం కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్లకు శిక్షణ

విజయనగరం టౌన్: సీతం ఇంజినీరింగ్ కళాశాలలో కంబైన్డ్ అన్నియల్ ట్రెనింగ్ క్యాంప్-5 ఆదివారం ప్రారంభమైంది. కమాండర్ కల్నల్ టాపస్ మండల్ ఎన్ సీసీ క్యాడెట్లకు నైపుణ్యాలు, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలపై అవగాహన కల్పిం చారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశి భూషణరావు మాట్లాడుతూ, క్యాడెట్లకు అవసరమైన వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ క్యాంప్ కమాం డెంట్ లెఫ్టినెంట్ కల్నల్ పల్లవివర్మ, సీతం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూ ర్తి, ఎన్‌సీసీ సిబ్బంది, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి 600 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

పోస్టర్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దాలి





గోడలపై రాసిన ప్రకటనలు శుభ్రం చేస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

- కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: విజయనగరం కార్పొరేషన్ పరి ధిలో అనధికార ఫ్లెక్సీలు, పోస్టర్లు, గోడలపై రాతలు, ప్రకటనలు చేపట్టరాదని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య సూచించారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆదేశాల మేరకు నగరమం తా అందంగా తీర్చిదిద్దే క్రమంలో తమతో సహక రించాలని కోరారు. ఈ మేరకు నగరంలో గోడలపై ఉన్న రాతలను ప్రత్యేక సిబ్బందితో ఆదివారం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ, ప్రభుత్వ, ప్రైవేటు గోడలపై ఎటువంటి రాతలు ఉండకూడదని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే అపరాధ రుసుం విధిస్తామన్నారు. గోడలపై కొంతమంది తమ ప్రకటనలను పెయిం టింగ్ రూపంలో వేస్తున్నారని, వాటిని కూడా నిషే ధిస్తున్నట్లు తెలిపారు. అక్టోబర్ 15న నిర్వహిం చనున్న పైడితల్లి జాతర సమయానికల్లా గోడలన్నీ అందంగా ఉండాలని స్పష్టం చేశారు. అసిస్టెంట్ సిటీప్లానర్ రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



తుప్పలు తొలిగిస్తున్న వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల సంఘ నాయకులు

- వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు ప్రసాదరావు

విజయనగరం ఫోర్ట్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల సం ఘ జిల్లా అధ్యక్షుడు బీకేవీ ప్రసాదరావు అన్నారు. ఆదివారం స్థానిక దాసన్నపేట జగన్నాథస్వామి ఆలయ ప్రాంగణంలో వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో స్వచ్ఛత హి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయం ఆవ రణలో ఉన్న చెత్తా చెదారం, పిచ్చి మొక్కలను తొలిగించారు. కార్యక్రమంలో వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పసు మూర్తి పద్మ, జిల్లా ప్రాంతీయ కార్యదర్శి దుర్గాభ వాని, వర్కింగ్ ప్రెసిడెంట్ జి. అప్పారావు, తది తరులు పాల్గొన్నారు.

సంగీతంపై మక్కువ పెంచుకోండి..



ముఖ్య అతిథి బాలసుబ్రహ్మణ్యంను సత్కరిస్తున్న అకాడమీ ప్రతినిధులు

విజయనగరం టౌన్: విద్యార్థులు సంగీతంపై మక్కువ పెంచుకుని, ఆ రంగంలో రాణించాలని డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం అన్నారు. రోటరీ దళిగి పేరాజు సంగీత అకాడమీ ద్వితీయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంగీత కచేరీ ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. అనంతరం ఆన్‌లైన్‌లో నాదారాధన పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు ఉసిరికల చంద్రశేఖరరావు, గౌరవా ధ్యక్షుడు డాక్టర్ డీవీ శ్రీకాంత్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు జి.వినోద్‌కుమార్, కార్యదర్శి నాగప్రకాష్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాపుగంటి ప్రకాష్, భోగరాజు సూర్యలక్ష్మి, ఉమా బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావాలు అలవర్చుకోవాలి



భక్తులకు ఆధ్యాత్మిక సూచనలు అందజేస్తున్న అర్చకులు

- రామతీర్థం దేవస్థానం అర్చకులు

నెల్లిమర్ల రూరల్: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావాలను అలవర్చుకోవాలని రామతీర్థం దేవ స్థాన ప్రధాన అర్చకులు సాయిరామాచార్యులు, కిరణ్‌కుమారాచార్యులు సూచించారు. మండలం లోని ఒమ్మి గ్రామంలో దేవీ శరన్నవరాత్రి ఉత్స వాల్లో భాగంగా ఏర్పాటు చేసిన పసుపు కొమ్ముల దుర్గమ్మ మండపాన్ని శనివారం రాత్రి సందర్శిం చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ఆశీర్వచనాలు అంద జేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... ఆధ్యాత్మికత మానసిక ప్రశాంతతను కలిగిస్తుందని, ప్రతి ఒక్కరూ ఇష్టమైన దైవాన్ని ప్రార్థించాలని సూచిం చారు. సాధు పరిషత్ అధ్యక్షుడు స్వామి శ్రీనివాస నంద సరస్వతి మాట్లాడుతూ.. గోమాత సకల దేవ తలకు నిలయమని, గోవులను పూజించడాన్ని ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలన్నారు. ఆదివారం సాయంత్రం మండపం ప్రాంగణంలో సహస్ర దీపా రాధన కార్యక్రమం వైభవంగా జరిగింది. కార్య క్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఫైర్ స్టేషన్ ఏర్పాటయ్యేనా..!

- కలగా మిగిలిన నియోజకవర్గ ప్రజల కోరిక
- దశాబ్దాలుగా స్థల పరిశీలనతోనే తాత్సారం చేస్తున్న అధికారులు
- జిల్లాలోనే అత్యధికంగా పరిశ్రమలు ఉన్న మండలం పూసపాటిరేగ



కొప్పెర్ల సమీపంలో అగ్నిమాపక స్టేషన్‌కు ప్రతిపాదించిన ప్రభుత్వ స్థలం

పూసపాటిరేగ : నెల్లిమర్ల నియోజకవర్గ ప్రజలకు ఫైర్‌స్టేషన్ ఏర్పాటు కలగానే మిగిలింది. గతంలో పూసపాటిరేగ పరిసర ప్రాంతంలో ఫైర్‌స్టేషన్ మం జూరు చేస్తున్నట్లు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో అప్పటి పూసపాటిరేగ తహసీ ల్దార్ కొప్పెర్ల రెవెన్యూ పరిధిలో మూడుచోట్ల ఫైర్‌స్టేషన్‌కు స్థల సేకరణ చేశారు. అనువైన ప్రదే శాన్ని ఎంపిక చేసి ప్రభుత్వానికి నివేదిక పంపిం చారు. ఇక్కడ నుంచే అసలు కథ మొదలైంది. ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలనుకునే స్థలం టీడీపీ నాయకులకు చెందినది కావడంతో స్టేషన్ మంజూ రుపై నీలినీడలు కమ్ముకున్నాయి. అనంతరం పూసపాటిరేగ పెట్రోల్‌బంక్ సమీపంలో గల ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. అయితే స్థలం అనుకూలంగా లేదని వదిలేశారు. దీంతో ఫైర్ స్టేషన్ ఏర్పాటు అక్కడితో ఆగిపోయింది. పూసపా టిరేగ, డెంకాడ, భోగాపురం మండలాలలో ఎక్కడ అగ్ని ప్రమాదం జరిగినా.. ఆయా మండల కేంద్రా లకు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న విజయనగరం ఫైర్ స్టేషన్ నుంచి అగ్నిమాపక శకటం రావాల్సిన పరిస్థితి నెలకొంది. అగ్నిమాపక యంత్రం వచ్చేలోపే జరగవల్సిన నష్టం అంతా జరిగిపోతోం ది. దీంతో విలువైన ఆస్తులు, ప్రాణాలు అగ్నికి ఆహుతవుతున్నాయి. ఇప్పటికైనా పూసపాటిరేగకు అగ్నిమాపక స్టేషన్ మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మంజూరు చేయాలి

అగ్నిమాపక స్టేషన్ లేకపోవడంతో ప్రమాదాల్లో విలువైన ఆస్తులు కోల్పోతున్నాం. ఫైర్ స్టేషన్ మం జూరు చేయాలని ఎప్పటి నుంచో ప్రతిపాదనలు చేసినప్పటికీ ఫలితం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మండలంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలి.

కె. కృష్ణ, పూసపాటిరేగ

శాలివాహన కులస్తులను ఆదుకోవాలి

లక్కవరపుకోట: శాలివాహన కులస్తులను ప్రభు త్వం ఆర్థికంగా ఆదుకోవాలని ఆ కులస్తుల ఉత్త రాంధ్ర జిల్లాల సంఘం అధ్యక్షుడు మానేపల్లి జేజేబాబు కోరారు. మండ లంలోని గోల్డ్ స్టార్ జంక్షన్ వద్ద ఓ కల్యాణ మండపంలో ఉత్తరాంధ్ర జిల్లాల శాలివాహన కులస్తుల సమావేశం ఆదివారం నిర్వహిం చారు.ముందుగా సంఘ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనం తరం జేజేబాబు మాట్లాడుతూ కుమ్మరి కులవృ త్తికి మనుగడ లేకపోవడంతో వినాయకుడు, దుర్గాదేవీ అమ్మవారి విగ్రహాలను తయారు చేసు కుంటూ జీవనం సాగిస్తున్నారని, ఈ బొమ్మలకు సరైన ధర లేకపోవడంతో పెట్టుబడి రాక నష్టా లు చవిచూస్తున్నారని అన్నారు. ఈ కుటుం బాలను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు. అనంతరం రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయ పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జామి మం డల కేంద్రంలోని శాలివాహన కులానికి చెందిన ఓ చిన్నారి చికిత్స కోసం సంఘం తరపున రూ.30 వేల ఆర్థిక సాయాన్ని చిన్నారి తల్లికి అం దజేశారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి స్వయంవరపు కనకారావు, ఉపాధ్యాక్షుడు చిన్నా రావు,కోశాధికారి మురళీ తదితరులు పాల్గొ న్నారు.

ఏరియా ఆస్పత్రి వద్ద ఉద్రిక్తత

గజపతినగరం: స్థానిక ఏరియా ఆస్పత్రి వద్ద ఆదివారం ఉద్రిక్తత నెలకొంది. వివరాల్లోకి వెళితే...మండలంలోని తుమికాపల్లి గ్రామానికి చెంది న రాపాక నూకరాజు(60)కు గుండె నొప్పిరావడంతో కుటుంబ సభ్యులు స్థానిక ఏరియా ఆస్పత్రికి తీసుకువచ్చారు. పరిస్థితి విషమించడంతో వైద్యం పొం దుతూ ఆయన మృతి చెందారు.వైద్యుల నిర్లక్ష్యం, సకాలంలో వైద్యం అందిం చకపోవడం వల్లే నూకరాజు చనిపోయాడని ఆయన కుటుంబ సభ్యులు వైద్యులతో వాదనకు దిగారు. అయితే వైద్యులు జగదీష్, వినీత్ మాట్లాడుతూ నూకరాజును ఆస్పత్రికి తీసుకువచ్చిన వెంటనే ప్రథమ చికిత్స చేసి, ఇంజక్షన్ చేశామని, ఈసీజీతో పాటు పీపీఆర్ సేవలు అందించినప్పటికీ పరిస్థితి విష మించడంతో మృతి చెందాడని చెప్పారు. సదరు వ్యక్తికి ముందుగానే బయట కొనుగోలు చేసిన మాత్రలను వేసి ఆస్పత్రికి తీసుకువచ్చారని, వైద్యసేవలం దించడంతో తమ నిర్లక్ష్యం ఏమీ లేదని తెలిపారు. మృతుడి బంధువుల ఆం దోళనతో ఆస్పత్రి వద్ద పరిస్థితి అదుపుతప్పే అవకాశం ఉందని భావించి ఆస్పత్రి సిబ్బంది స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందజేశారు. ఎస్ఐ లక్ష్మణరావు, పోలీస్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని నూకరాజు కుటుంబ సభ్యులకు సర్ది చెప్పి మృత దేహాన్ని గ్రామానికి తరలించే ఏర్పాటు చేశారు.